మన కవిపండితుల చమత్కృతులు :

# ★ తీర్థులుగారి మీద తీర్పు !

నిడుదవోలు
పార్వతీశ్వరరావు

ఆమె మేజస్ట్రీటుగారి అమ్మాయి అని అందరకూ తెలిసిందే- అప్పుళ్ళో.

వీధి అరుగుమీద కూర్చుని ఎవరితోనో ప్రసంగిస్తూన్న మన శాస్త్రిగారు, ప్రతీరోజు ఆ దారినే పొయ్యే ఆ అమ్మాయిదగ్గరకు రాంగానే "ఈ అమ్మాయివి రంకుకళ్ళుసుమీ" అని అనేసరికల్లా ఆమె ఒక్కసారి తన మొహం గిర్రున తిప్పి శాస్త్రిగారివైపు చురచుర చూచి చరచరా నడిచి వెళ్ళిపోయేది.

శాస్త్రిగార్ని ఆబాలగోపాలానికీ తెలుసుగా. అప్పట్లో—ఆయనంటే అందరూ మన్నిస్తారు- మర్యాదలిస్తారుకూడ-పెద్దలు ఆయన్ని "శాస్త్రీజీ" అని పిలుస్తారు.

మర్నాడు మెజస్ట్రీట్ కోర్టుకు హాజరు కమ్మని బిళ్ళబంట్రోతు భీకరంగా చెప్పి వెళ్ళిపోయాడు- ఆ రోజుల్లో మెజస్ట్రీటంటే—హడల్—ఈ నాటి ఏటంబాంబులా.

అయినా శాస్త్రిగారు కించిత్తయినా భయపడక కోర్టుకు వెళ్ళారు ఆనాడు.

"ఏమోయ్—శాస్త్రీజీ ! మా అమ్మాయివి "రంకు" కళ్ళా? నీకు అక్కా చెల్లెళ్లు లేరటయ్యా ?" అని హూంకరించేరు మెజస్ట్రీట్ గారు—

శాస్త్రిగారు అంజలి ఘటించి "చిత్తం - మనవి చేస్తాను — పండితుల్ని రావించండి. "రంకు" అంటే లేడి అని అర్ధం- వచ్చినట్లు అనేక కవుల ప్రయోగాలు వున్నాయి- స్త్రీల కళ్ళ సౌందర్యం లేడికళ్ళలో సమన్వయిస్తూంటారు- కవులు- నేను "ఓ! లేడికన్నులవంటి కన్నులు గలదానా ! అంటే ఓ! మృగాక్షీ! ఓ! ఏణీ లోచనా !" అని మీ అమ్మాయియొక్క కళ్ళ అందాన్నిగూర్చి పొగిడితే మీరిలా పెడర్థాలు తీసుకొని తప్పుగా ఊహిస్తే మేమేం చెయ్యగలం" అని అనేసరికి కోర్టులో వున్న యావన్మంది ఒక్కసారి ఫక్కున నవ్వేరు- మేజస్ట్రీట్ గార్ని చూస్తూ. ఆయన వింత ప్రశ్నకి- అసలు కిటుకు ఎవరికి తెలుసు.

మొహం చిట్లించుకొని మెజస్ట్రీట్ గారు "శ్లేషార్థాలు వచ్చే మాటలు వాడితే ఎట్లా ?" అని ఊరుకొన్నారు—

ఆ అమ్మాయిని అలా ఏడిపించి అంత యుక్తిగా తప్పించుకొన్న శాస్త్రిగారు— యిలాటి చిలిపి చేష్టలే చేసేవారు- ఆయన జీవితంలో— ఇంతకూ ఆయన ఎవరనుకుంటున్నారు ? ఆయన నామధేయం —శ్రీ పురాణం—సూర్యనారాయణ తీర్థులు- మొన్ననే స్వర్గస్థులైనారు.

భోజనాలదగ్గర మా నాన్నగారు ఆయన్ని గురించి ప్రసంగిస్తూ ఈవిషయం మాకు సరదాగా చెప్పేరు.

సూర్యనారాయణతీర్థులుగారి ఆత్మకు శాంతి గోరుతూ, మనం ఆయనకు స్వహస్తులమై స్వార్పణం గావింగాలి—


త్వరలోనే

కొత్త శీర్షికలు

★

* కోస్తా వింతలు
* పిల్లలు పెద్దలు....
* యాత్రలు : విశేషాలు
* స్వతంత్ర భారతిలో....

మరి ఎన్నో ఆకర్షణలు